ఆదివారం | సంపుటి (Volume): 14
SUNDAY | సంచిక (Issue): 33
28.7.2024 | వెల (Price) రూ.8.00
కరీంనగర్ KARIMNAGAR
PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline
పేజీలు: 16 +32 పేజీల ఆదివారం అనుబంధం
Pages: 16 +32 Pages SUNDAY supplement

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA

ముహూర్తం

ఆదివారం, సూర్యోదయం: 5-54, సూర్యాస్తమయం: 6-51. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ రుతువు ఆషాఢ మాసం కృష్ణ పక్షం తిథి: అష్టమి రాత్రి 7-28 వరకు. నక్షత్రం: అశ్విని ఉదయం 11-47 వరకు, తదుపరి భరణి. వర్జ్యం: ఉదయం 8-00 నుంచి ఉదయం 9-32 వరకు, పునర్ వర్జ్యం రాత్రి 9-03 నుంచి రాత్రి 10-36 వరకు. రాహుకాలం: సాయంత్రం 5-12 నుంచి సాయంత్రం 6-49 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 5-06 నుంచి సాయంత్రం 5-58 వరకు. అమృతకాలం: లేదు. హైదరాబాద్ బోనాలు.

శనివారం నందిమేడారం పంపులనుంచి ఎగజిమ్ముతున్న గోదావరి జలాలు

బీఆర్ఎస్ డెడ్‌లైన్.. కాళేశ్వరం హెడ్‌లైన్

దెబ్బ తగిలితేగానీ ధర్మం గుర్తుకు రాలేదు కాంగ్రెస్ సర్కారుకు! ప్రభుత్వం ప్రజల క్షేమం కోసం పనిచేయాలన్న రాజధర్మం పక్కన పెట్టి రాజకీయాలు చేయాలనుకున్నది. పీఆర్ స్టంట్‌లతో గత ప్రభుత్వం మీద అలా బురద చల్లుకుంటూ పోతూనే ఉండాలనుకున్నది. కాళేశ్వరం వృథా అని నిరూపించడం కోసం లక్షల క్యూసెక్కుల కాళేశ్వరం నీటిని సముద్రం పాలు చేసింది. ఆ పాపాన్ని గత ప్రభుత్వం ఖాతాలో వేయాలనుకున్నది. కానీ ఏమైంది? ఆ ఎత్తుగడ ఎదురుతన్నింది.

'కాళేశ్వరం పంపులు నడిపి గోదావరి జలాలను రైతుల కివ్వాలని' బీఆర్ఎస్ ఎన్ని రోజులనుంచి మొత్తుకుంటున్నా పట్టని రేవంత్ సర్కారు.. నిన్నటి కేటీఆర్ బృందం మేడిగడ్డ పర్యటనతో ఉలిక్కిపడింది. ఈ పర్యటనతో మేడిగడ్డ వద్ద పరవళ్లు తొక్కుతున్న అఖండ గోదావరి ప్రవాహాన్ని ప్రజలు చూశారు. చెక్కు చెదరకుండా ఉన్న మేడిగడ్డ బ్యారేజీనీ, పారుతున్న లక్షల క్యూసెక్కుల నీటిలో కొట్టుకుపోతున్న అబద్ధాలను, వంచనలను చూశారు. వాస్తవాలు ప్రజలకు కండ్లకు కట్టాయి. దీనికి తోడు కాళేశ్వరం నీటి ఎత్తిపోతలకు బీఆర్ఎస్ విధించిన డెడ్‌లైన్.. 50వేల మంది రైతులతో ముట్టడి హెచ్చరికలు జారీ చేయడంతో హడలిపోయి ఆగమేఘాల మీద ఎల్లంపల్లిలో పంపులు ప్రారంభించింది ప్రభుత్వం. తెలంగాణ భాషలో చెప్పాలంటే దెబ్బకు దయ్యం వదిలింది!

అయినా గాలివాటుగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది కొత్త కాదు. పార్లమెంటు ఎన్నికలకు ముందు కేసీఆర్ రైతు పరామర్శ యాత్ర జరిపి హెచ్చరిక చేస్తే తప్ప (మిడ్ మానేరు?) నీరు విడుదల కాలేదు. హరీశ్‌రావు రాజీనామా సవాలు చేసి మిన్నుమన్ను ఏకం చేస్తేగానీ రైతు రుణమాఫీపై కదలలేదు. ఇపుడు కాళేశ్వరం నీరు ఎత్తిపోతల కూడా!

నంది మేడారం, గాయత్రి పంపుల్లోంచి గోదావరి జలాలు ఎగజిమ్మిన తీరు మళ్లీ కేసీఆర్ హయాంనాటి రోజులను గుర్తుకు తెచ్చాయి. ఎండిన పంటలతో బోరుమంటున్న రైతులకు మరోసారి కేసీఆర్ పాలన, లాలన గుర్తుకు వచ్చాయి. కాళేశ్వరం ముట్టం.. కన్నెపల్లి ముట్టం అని ప్రభుత్వంఇంకా ఇవే రాజకీయాలు చేయాలనుకున్నా.. ఎల్లంపల్లిలోని టీఎంసీల లెక్కలు సహకరించే పరిస్థితి అయితే లేదు. కేసీఆర్ నిర్మించిన నందిమేడారం తదితర పంపుహౌస్‌లు ఎలాగూ వాడారు. ఇంక కన్నెపల్లి పంపుహౌస్ వాడడానికి బిడియం ఎందుకు? నీటిని ఎత్తే పంప్‌హౌస్‌లనుంచి ఆ నీటిని నిల్వచేసే రిజర్వాయర్లు.. మిడ్‌మానేరు, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ సహా అన్నీ కేసీఆర్ కట్టించినవే. ఆఖరుకు ఇపుడు నీరు ఎత్తిపోస్తున్న ఎల్లంపల్లి కూడా కేసీఆరే పూర్తి చేశారు. బతిమాలితే పని కాదని.. బడితె పడితే తప్ప పని జరగదని.. కొరడా ఝుళిపిస్తే తప్ప సర్కారు ముందుకు కదలదని మరోసారి రుజువైంది. అయినా ఇది ప్రారంభమే! ముందు ముందు రోజుల్లో బహుత్ కుచ్ బాకీ హై!!!

- కేటీఆర్ గర్జనతో ఎగిసింది గంగ..



- ఎండిన సాగరమిక నిండేను వేగంగ!

ప్రస్తుతం డెడ్‌స్టోరేజీకి చేరిన రంగనాయక సాగర్ రిజర్వాయర్

తప్పు అన్న ప్రాజెక్టు ఇప్పుడెట్ల ఒప్పు అయ్యింది?

రానే రాదన్న గోదారి గంగ ఇప్పుడు ఎట్ల ఉప్పొంగింది?
గిర్రున తిరిగిన ఈ పంపులు కాళేశ్వరానివి కావా?
బిరబిరా ఎగసిన ఈ నీళ్లు కాళేశ్వరానివి కావా?
జర్రున పారే కాలువలు కాళేశ్వరానివి కావా?
రేపటి రోజున నిండే సాగరాలు కాళేశ్వరానివి కావా?
వృథా అయ్యింది ప్రజా ధనమా? కాంగ్రెస్ మాటలా?

కేటీఆర్ అల్టిమేటం ఇవ్వడానికి ముందే ఈ నీళ్లు ఎత్తిపోసి ఉంటే వేల ఎకరాల్లో పంటలు ఎండేవి కాదుకదా!

కేటీఆర్ వార్నింగ్ మోటర్లు స్విచాన్

- అల్టిమేటం ఇచ్చిన 24 గంటల్లోనే ఎత్తిపోతలు షురూ
- నాలుగు మోటర్లతో 12,600 క్యూసెక్కుల ఎత్తిపోత
- మధ్యమానేరుకు చేరుకుంటున్న ఎల్లంపల్లి జలాలు

కరీంనగర్, జూలై 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాళేశ్వరం జలాల పంపింగ్ ప్రక్రియను ఆగస్టు 2లోగా ప్రారంభించకపోతే.. 50 వేల మంది రైతులతో వచ్చి మోటర్లు ఆన్ చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వార్నింగ్‌కు రేవంత్ సర్కారు తలవంచింది. అల్టిమేటం ఇచ్చిన 24 గంటల్లోనే కాంగ్రెస్ సర్కారు ఆగమేఘాల మీద పంపులను ఆన్ చేసింది. ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు (శ్రీ రాజరాజేశ్వర) ప్రాజెక్టుకు శనివారం ఎత్తిపోతలను ప్రారంభించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇదే పంపుల ›2వ పేజీలో

మేడిగడ్డ కుంగుబాటుపై అనుమానాలు

- ఎన్నికల ముందే ఇలా ఎందుకు జరిగింది?
- బరాజ్‌కు ఏం జరిగినా సర్కారుదే బాధ్యత
- 28 లక్షల క్యూసెక్కులను తట్టుకున్న బరాజ్
- మంత్రి ఉత్తమ్‌కుమార్ నోట బీజేపీ మాట
- ఆగస్టు 2 తరువాత కాళేశ్వరంపై కార్యాచరణ
- మీడియాతో ఇష్టాగోష్టిలో కేటీఆర్

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ముందు మేడిగడ్డ బరాజ్ కుంగిపోవటం వెనుక కాంగ్రెస్ పార్టీ కుట్ర ఉందేమోనని కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా నిట్టనిలువునా, చెక్కుచెదరకుండా నిలబడిన మేడిగడ్డ బరాజ్ ఎన్నికల ముందే ఎలా కుంగిపోయిందని ప్రశ్నించారు. ప్రభుత్వంలోని ఒకరిద్దరు మంత్రులు బరాజ్‌ను ఏదైనా చేయగల సమర్థులని, వారికి ఎవరెవరితో సంబంధాలున్నాయో తమకు తెలుసనని చెప్పారు. భవిష్యత్తులో మేడిగడ్డ బరాజ్‌కు ఏమి జరిగినా అది ప్రభుత్వ కుట్రఫలితమే అని భావించాల్సి వస్తుందని ఆయన తేల్చిచెప్పారు. శనివారం బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టును విఫల ప్రాజెక్టుగా చూపించాలని కాంగ్రెస్ నేతలు భావించారని, అందులో ఆ పార్టీ నేతలు విఫలం అయ్యారని అన్నారు. మేడిగడ్డ ›3వ పేజీలో

తెలంగాణ కొత్త గవర్నర్‌గా జిష్ణుదేవ్‌వర్మ ›14

మరో రెండు ›2 రోజులు వర్షాలు
పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

జల దిగ్బంధంలో భద్రాచలం
54 అడుగులు దాటి ప్రవహిస్తున్న గోదావరి ›2
మూడో ప్రమాద హెచ్చరిక జారీ

హెచ్చుతగ్గుల నిద్రతో డయాబెటిస్ ›14

కాంగ్రెస్ అంటేనే ధోకా

6 గ్యారెంటీల అమలుకు కేటాయింపులేవి?.. బడ్జెట్‌లో వాస్తవాల విస్మరణ, అబద్ధాల విస్తరణ

అసెంబ్లీలో తూర్పారబట్టిన హరీశ్... సీఎం, ఆరుగురు మంత్రులు అడ్డుకున్నా ఆగని వాగ్ధాటి

- లాలీలతో సమాధానం చెప్పడమే ఇందిరమ్మ రాజ్యమా?
- వీపులు పగలగొట్టడమేనా మీరు చెప్తున్న ప్రజాపాలనా?
- బడ్జెట్‌లో ప్రజలకోణం తక్కువ.. రాజకీయం ఎక్కువ
- మహిళలకు రూ.2,500 నుంచి రుణమాఫీ దాకా ధోకా
- పదేండ్ల కేసీఆర్ పాలన ఫలితమే నేటి తెలంగాణ వృద్ధి రేటు
- కరెంటు కోతలపై అసెంబ్లీ గేటు బయట సవాల్‌కు సిద్ధమా?
- మీరు చేసిన ఆలస్యం వల్ల రైతులు వడ్డీలు కట్టాల్సి వస్తున్నది
- ఎక్సైజ్‌లో రూ.7,200 కోట్లు అదనంగా ఎలా వస్తాయి?
- గల్లీ గల్లీకో బెల్ట్‌షాపులపై సమాధానం చెప్పరెందుకు?
- నాడు భూములు అమ్మబోమని.. ఇప్పడెలా అమ్ముతున్నరు?
- రూ.10వేల కోట్లను సభకు తెలియకుండా ఎలా తెస్తరు?
- 6 గ్యారెంటీలపై సోనియమ్మతోనే అబద్ధం చెప్పించారే!
- హామీలు మరిచి బాండ్ పేపర్‌కే వాల్యూలేకుండా చేశారు
- రాజీనామా చేయాలన్న రాహుల్‌కు ఏం విలువిచ్చారు?
- ప్రజల మెమొరీ నుంచి పదేండ్ల స్వర్ణయుగాన్ని చెరప లేరు
- లా అండ్ ఆర్డర్ దిగజారిందనడానికి లాఠీచార్జీలే నిదర్శనం
- అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీని చీల్చి చెండాడిన హరీశ్‌రావు

రాష్ట్రంలో 90% రైతులు పండించేది దొడ్డు రకమే. సన్నాల సాగు పెంచండి కానీ దొడ్డు రకానికి ద్రోహం చేయొద్దు. బోనస్ బోగస్ అయ్యింది. సన్నాలను ప్రోత్సహించాలనే సదాశయమే ఉంటే సన్నాలకు వెయ్యి, పదిహేను వందలు బోనస్ ఇవ్వాలి. -హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): 'ఎనిమిది నెలల కాంగ్రెస్ పరిపాలన చూసిన తర్వాత నమ్మి నానపోస్తే పుచ్చిబుర్రలైనట్టుంది. కేంద్ర బడ్జెట్ తెలంగాణకు మొండిచేయి చూపింది. రాష్ట్ర బడ్జెట్‌లో అభయహస్తం శూన్యహస్తంగా మారింది. వాస్తవిక అంచనాలతో రూపొందించిన బడ్జెట్ అని డబ్బా కొట్టినా, బడ్జెట్ అంచనాలకు, వాస్తవికతకు మధ్య చాలా దూరం ఉన్నది. ఇది ప్రజల బాగోగులే కేంద్రంగా తయారైన బడ్జెట్ కాదు. రాజకీయం ఎక్కువ, ప్రజల కోణం తక్కువ. ఆరు గ్యారెంటీలకు దిక్కులేదు. హామీలు నెరవేరే మార్గం లేదు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్టు సంపద వల్ల సమర్థత రాదు కానీ, సమర్థత వల్ల సంపద వస్తుది. ఈ ప్రభుత్వానికి సమర్థత లేదు. వాస్తవిక అంచనాలు లేవు కనుక ఆశించిన సంపద రాదు. ఫలితంగా ప్రజల సమస్యలు పరిష్కారం కాబోవనే నిరాశనే బడ్జెట్ మిగిల్చింది' అంటూ అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తూర్పారబట్టారు. ఇకనుంచైనా ప్రభుత్వానికి రాజకీయాలు కేంద్రంగా కాకుండా, ›10వ పేజీలో

స్మార్ట్ మీటర్లు పెట్టక తప్పదు

లేదంటే డిస్కంలపై కేంద్రం చర్యలు.. విద్యుత్తు శాఖకు విధిలేని పరిస్థితి
2017లోనే బీఆర్ఎస్ ఒప్పందం.. 'ఉదయ్'లో చేరటంతోనే ముప్పు అవును.. మాకు ప్రధాని పెద్దన్నే.. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

ఉదయ్ స్కీంకు బాయికాడి మీటర్లకు లింకెట్ల పెడతరు?

2017 నాటి ఉదయ్ స్కీమ్‌తో 2021 నాటి విద్యుత్తు మీటర్ల ఏర్పాటు అంశం కలిపి సభను తప్పదోవ పట్టిస్తున్నారు: హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 27(నమస్తే తెలంగాణ): విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టక తప్పని పరిస్థితి ఏర్పడిందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం జెన్‌కో, ట్రాన్స్‌కోలపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. శనివారం శాసనసభలో విద్యుత్ మీటర్ల అంశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... 'తెలంగాణ ప్రభుత్వం ఒకవేళ ఈ ఒప్పందాలను అమలు చేయకపోతే, స్మార్ట్ మీటర్లు బిగించకపోతే అగ్రిమెంట్‌ను ఉల్లంఘించామని కేంద్ర ప్రభుత్వం డిస్కంలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పుడు మెడమీద కత్తి వేలాడుతున్నది. ఈ ఒప్పందాలు రాష్ట్రానికి గుదిబండగా మారాయి. తెలంగాణ ప్రభుత్వానికి, ›7వ పేజీలో

అప్పుల బాధతో మరో రైతు ఆత్మహత్య
హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో ఘటన ›13



పిల్లలు కావాలా?

రాత్రి 10.45 గంటల్లోగా నిద్రపోండి!

గర్భం దాల్చాలనుకొనే మహిళలు నిద్రకు ఉపక్రమించే సమయం పైనా, నిద్రించే వ్యవధిపైనా శాస్త్రవేత్తలు కీలక సూచన చేశారు. రాత్రి 10.45 గంటల్లోగా నిద్రపోవాలని సూచించారు. ఆలస్యంగా నిద్రకు ఉపక్రమించడం వల్ల అంతర్గత జీవ గడియారానికి విఘాతం కలిగి హార్మోనల్ చైన్ రియాక్షన్ వస్తుందని తెలిపారు. ఫలితంగా అండం, శుక్రకణాల ఫలదీకరణ అవకాశాలు తగ్గి సంతాన లేమికి దారి తీస్తుందన్నారు. ›14

- దవాఖానలు కిటకిట

రోగులతో కిక్కిరిసిన మహబూబాబాద్ జిల్లా దవాఖాన

కొండనాలుకకు మందేస్తే..

వైద్యశాఖలో విచక్షణలేని బదిలీలు
చిన్న దవాఖానలకు వెళ్లిన పెద్ద డాక్టర్లు!
రోగులకు శాపంగా మారిన వైద్యుల ట్రాన్స్‌ఫర్లు
నగరంలోని ప్రధాన టీచింగ్ దవాఖానలన్నీ ఖాళీ
60 శాతానికి పైగా సీనియర్లకు స్థాన చలనం
గాంధీ, ఉస్మానియాలో నిలిచిన శస్త్రచికిత్సలు ›13

అప్పుడప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు తోడు మసురువానతో హైదరాబాద్‌లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. చిన్నాపెద్ద దవాఖానలన్నీ రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రోగులకు శాపంగా మారింది. అనాలోచిత బదిలీల కారణంగా 60 శాతానికిపైగా సీనియర్ వైద్యులకు స్థానచలనమైంది. ఫలితంగా నగరంలోని ప్రధాన టీచింగ్ దవాఖానలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గాంధీ, ఉస్మానియాలో ఆపరేషన్లు నిలిచిపోవడంతో రోగులు విలవిల్లాడుతున్నారు.